## మెదక్ చర్చిని సందర్శించిన హైకోర్టు జడ్జి


చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

మెదక్ అర్బన్, మే17: మెదక్ చర్చి(సీఎస్ఐ)ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.సామ్ కోసి కుటుంబ సభ్యులతో శుక్రవారం సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ ఉన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి జాతరకు మంత్రి హాజరు



రేగోడ్, మే 17: మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్ర స్వామి జాతరకు వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహా శుక్రవారం హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మంత్రితో ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు, మున్నూరు కిషన్, రేగోడ్ గ్రామ పార్టీ అధ్యక్షుడు శంకరప్ప, నాయకులు తదితరులు ఉన్నారు.

## రైతుబీమా కోసం వివరాలు సేకరణ


మృతుడి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

నిజాంపేట, మే, 17: నిజాంపేటకు చెందిన రైతు ఎల్లయ్య అప్పుల బాధతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. మృతుడు రైతుబంధు పథకానికి అర్హుడు కావడంతో శుక్రవారం వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి వివరాలు సేకరించి, రికార్డులో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో సతీశ్, ఏఈవో కావేరి, ఆర్ఐ గంగాప్రసాద్ ఉన్నారు.

## తహసీల్దార్ వాఖ్యలపై రైతుల కన్నెర్ర


రైతులకు క్షమాపణలు చెబుతున్న తహసీల్దార్ లక్ష్మణ్ బాబు

పాపన్నపేట, మే 17: 'మాకు కుటుంబాలు, పెళ్లాం పిల్లలు లేరా.. మీరు ఆందోళన చేసినప్పుడల్లా మీ వద్దకు రావడానికి' అని పాపన్నపేట తహసీల్దార్ చేసిన వ్యాఖ్యలకు వందలాది మంది రైతన్నలు మండిపడ్డారు. వారం రోజులుగా నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లను ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు మిన్‌పూర్ వద్ద రోడ్డుపై రెండు గంటలు రాస్తారోకో చేశారు. దీంతో మెదక్–బొడ్మట్‌పల్లి రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. మిన్‌పూర్‌లో ధాన్యం రవాణాకు నోచుకోక కల్లాల్లోనే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫోన్లు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏఎస్సై సంగన్న సిబ్బందితో వచ్చి రైతులకు నచ్చజెప్పారు. తహసీల్దార్ రైతులకు క్షమాపణ చెప్పి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## రూ.12.60 లక్షలకు పూజ సామగ్రి వేలం

శివ్వంపేట, మే 17: మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీలో గల చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించి పూజ సామగ్రి రూ.12 లక్షల 60 వేలకు వేలంపాటలో పాడుకున్నారు. శుక్రవారం ఒక సంవత్సరానికి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజ సామగ్రి విక్రయించేందుకు ఆలయ ఫౌండర్ చైర్మన్ భాస్కరరాయిని ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో వేలంలో వేలం నిర్వహించారు. చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన కే.మహేశ్ రూ.12.60 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో నారాయణరావు, శంకర్‌గౌడ్, వీరస్వామి, పాపయ్యాచారి, సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాస్, ప్రకాశ్‌చారి తదితరులు ఉన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

చిలిపిచెడ్(కొల్చారం), మే 17: రోడ్డు దాటుతున్న సమయంలో మెదక్ నుంచి హైదరాబాద్ వెళ్లుతున్న కారు బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. కొల్చారం గ్రామానికి చెందిన నిమ్మగల్ల దేవయ్య (50) తన పొలంలో పశువుల మేత కోసం వెళ్లాడు. ఈ క్రమంలో మెదక్ నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా మెదక్ నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న టీఎస్08 జేయూ1412 గల కారు డ్రైవర్, దేవయ్యను బలంగా ఢీకొట్టి పరారైయ్యాడు. దేవయ్య కాలు తెగి పడింది. బాధితుడిని చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ప్రమాదానికి కారణమైన కారును పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

అల్లాదుర్గం, మే17: మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి జీవిత ఖైదు ఖరారైనట్లు పోలీసులు తెలిపారు. గతేడాది మేలో చిల్వర్ గ్రామానికి చెందిన నాయకుని విఠల్ తన సొంత అన్న జగన్‌కు డబ్బుల విషయంలో జరిగింది. గొడవ కారణంగా విఠల్, జగన్‌ను రాయితో తలపై కొట్టి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందుతుడిని కోర్టులో హాజరుపర్చారు. శుక్రవారం నిందితుడికి జిల్లా జడ్జి లక్ష్మీశారద యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో సోషల్ మీడియా టీంతో కలిసి చిలిపిచెడ్ మండల చిట్కుల్ బద్రియ తండాకు చెందిన నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రెడ్డి రాథోడ్ శుక్రవారం కలిశారు. ఆయనతోపాటు టీం సభ్యులు ఉన్నారు. – చిలిపిచెడ్, మే 17



# గొర్రెల స్కీం గోవిందా!



| మండలం | డీడీలు చెల్లించిన వారు |
|---|---|
| అల్లాదుర్గం | 275 |
| చేగుంట | 95 |
| చిలిపిచెడ్ | 0 |
| హవేలీఘనపూర్ | 0 |
| కౌడిపల్లి | 56 |
| కొల్చారం | 121 |
| మనోహరాబాద్ | 171 |
| మెదక్ | 16 |
| నర్సాపూర్ | 40 |
| నార్సింగి | 12 |
| నిజాంపేట్ | 197 |
| పాపన్నపేట | 158 |
| రామాయంపేట | 102 |
| రేగోడ్ | 77 |
| పెద్దశంకరంపేట | 76 |
| చిన్నశంకరంపేట | 0 |
| శివ్వంపేట | 92 |
| టేక్మాల్ | 233 |
| తూప్రాన్ | 123 |
| వెల్దుర్తి | 98 |
| మొత్తం | 1942 |

- డీడీలు కట్టిన లబ్ధిదారుల పైసలు వాపస్!
- మెదక్ జిల్లాలో 1942 మంది లబ్ధిదారులు
- ఒక్కో లబ్ధిదారుడి వాటా రూ.43,750

మెదక్, మే 17 (నమస్తే తెలంగాణ): గొల్లకురుమల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గొర్రెల పంపిణీ పథకం కథ ముగిసినట్లే. గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకుని డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు వాటిని తిరిగి ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ నిర్ణయించింది. నెలలు గడుస్తున్నా గొర్రెల యూనిట్లు ఇవ్వకపోవడంతో తమ డీడీలు తిరిగి ఇవ్వాలని ఎంపికైన లబ్ధిదారులు కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత ఎంపీ ఎన్నికల ముందు జిల్లాలోని పాపన్నపేట మండలానికి చెందిన గొల్లకుర్మలు డీడీలు వాపస్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు.

### మెదక్ జిల్లాలో 1942 మందికి..

బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 343 సొసైటీల్లో 20,182 మంది సభ్యులున్నారు. ఈ పథకంలో ఎంపీడీవో, తహసీల్దార్, మండల పశువైద్యాధికారి సభ్యులతో కూడిన లబ్ధిదారుల ఎంపిక కమిటీని నియమించింది. గ్రామీణ ప్రాథమిక గొర్రెల పెంపకం సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 18 ఏళ్లు నిండిన వారికి గొర్రెలు అందించింది. మొదటి విడతలో 20 వేల టార్గెట్ కాగా, 12,998 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీచేశారు. రెండో విడత లక్ష్యం 7,184 కాగా 642 మందికి గొర్రెలు అందజేశారు. ఇంకా 1942 మందికి గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గొర్రెల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేసిందని గొల్ల కురుమలు వాపోతున్నారు.

### రూ.43,750 చొప్పన డీడీ..

మెదక్ జిల్లాలో 1942 మంది గొల్ల, కుర్మలకు గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉంది. వీరు రూ.43,750 చొప్పున గొర్రెల కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించారు. గతంలో 2020లో గొర్రెల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో మరోసారి పంపిణీ ప్రక్రియ చేపట్టింది. ధరలు పెరిగాయనే ఉద్దేశంతో యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచుతూ లబ్ధిదారుని వాటాగా రూ.43,750 చెల్లించాలని సూచించారు. మొదటి విడతలో అమలు చేసిన డీడీల విధానానికి స్వస్తి పలికింది. వాటికి బదులుగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఆన్‌లైన్ అకౌంట్ నంబర్ కేటాయించింది. దీంతో గొల్ల, కుర్మలు రూ.43,750 చొప్పున అకౌంట్‌కు తమ వాటా సొమ్ము జమ చేశారు.

### డీడీల వాపస్‌కు కసరత్తు..

గొల్ల, కుర్మల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో డీడీలు కట్టిన వారికి వాపస్ ఇచ్చేయాలని పశు సంవర్ధక శాఖ నిర్ణయించింది. జిల్లాలో 1942 మందికి చెందిన రూ.8.49 కోట్లకు సంబంధించిన డీడీలు తిరిగి ఇచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

# దొడ్డు రకం వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలి

- రైతు వ్యతిరేకి కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

వెల్దుర్తి, మే 17: రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీనిచ్చిన కాంగ్రెస్ ఎంపీ ఎన్నికలు అవగానే సన్న రకానికి మాత్రమే బోనస్ అంటూ రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మోహన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వెల్దుర్తిలో విలేకరులతో మాట్లాడారు. హామీలు నెరవేర్చక చేతులెత్తేసిన కాంగ్రెస్ వాయిదాలు ప్రకటిస్తూ ప్రజలను వంచిస్తున్నదన్నారు. కాంగ్రెస్ మోసాన్ని గుర్తించిన ప్రజలు, రైతులు ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. యాసంగి ముగిసి నెలలు గడుస్తున్నా నేటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదన్నారు. అకాల వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కరణం మురళి, పార్టీ వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు కృష్ణాగౌడ్, అశోక్‌గౌడ్ ఉన్నారు.


వెల్దుర్తిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, నాయకులు

### రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి: బీఆర్ఎస్

మెదక్ మున్సిపాలిటీ, మే 17: రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌ను గద్దె దించాలని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కొనకపోవడంతో వర్షాలకు తడిసి ముద్దవుతున్నదని, వెంటనే ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు.


శివ్వంపేట: కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్

### ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

శివ్వంపేట, మే 17: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉసరికపల్లి, చండి, శభాశ్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లలో వేగం పెంచేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- 20 రోజుల వ్యవధిలో మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలి
- ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలి
- కలెక్టర్లతో వీడియో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

మెదక్, మే 17 (నమస్తే తెలంగాణ): పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే సర్కారు బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఎస్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో సమావేశంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్లు, ఉన్నతాధికారులను అభినందించారు. అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు పున:ప్రారంభించేందుకు మరో 20 రోజుల గడువు ఉందన్నారు. ఆ లోగా అభివృద్ధి పనులు పూర్తి చేసి పాఠశాలలు ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాలికల సంఖ్య ప్రకారం ప్రత్యేక టాయిలెట్లు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట పెయింటింగ్ వేయాలన్నారు. స్కూలు యూనిఫామ్‌లు జిల్లాలకు చేరుతున్నాయన్నారు. ఇప్పటివరకు 17 జిల్లాలకు బట్ట చేరిందని, మరో 3 రోజుల్లో మిగిలిన జిల్లాలకు చేరుతుందని సీఎస్ తెలిపారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేయాలని తెలిపారు.

### ధరణి పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి మార్చి 15 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15 వేలు పరిష్కరించామన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాలన్నారు. ఈనెల చివరి నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన మార్పులు ధరణి మాడ్యుల్స్‌లో చేసినట్లు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల్లో అధికంగా రెవెన్యూ, ధరణి సంబంధిత సమస్యలు వస్తున్నాయన్నారు. వీటి ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. ఎన్నికలు ఉన్నప్పటికీ 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నులు కొనాల్సి ఉన్నదని, సత్వరమే కొనుగోలు చేయాలన్నారు. 5 రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు పురోగతిని ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ హరికృష్ణ, డీఆర్డీవో శ్రీనివాస్ రావు, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, మెప్మా పీడీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీపీ

పాపన్నపేట, మే 17: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చందనారెడ్డి కోరారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదన్నారు. ఉపాధి డబ్బులు రావడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నదని, లారీలు సరిగా రావడం లేదని అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డీఎల్పీవో సతీశ్‌కుమార్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు గౌస్, ఎంపిటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ

**- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

మెదక్ మున్సిపాలిటీ, మే 17: ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ 3వ తేది వరకు పరీక్షలు కొనసాగుతాయని, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు జిల్లాలో 6,110 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందులో ప్రథమ సంవత్సరంలో 3,812 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,298 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ రాజేశ్, ఆర్టీసీ మేనేజర్ సుధా, ట్రాన్స్‌కో, వైద్య, పోస్టల్ శాఖ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 17: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు స్థానిక సంస్థల్లో బీసీలకు 23 నుంచి 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కుల గణన జరిపి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు.

## ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం

నర్సాపూర్, మే 17: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ టి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట గిరిజన గురుకులంలో బాలురు, 25న మెదక్ జిల్లా చేగుంట జూనియర్ కళాశాలలో బాలికలు, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 2023–24లో 10వ తరగతి పూర్తి చేసిన (ఎస్టీ) విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. మెమో, బోనఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

## అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు


ఝాన్సీ, అధికారి

వెల్దుర్తి, మే 17: వానకాలం సీజన్‌కు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగ, జనుము) అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయ అధికారిణి ఝాన్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే 60 క్వింటాళ్ల జనుము, 260 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కావాలని నివేదికలు పంపించామన్నారు. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విత్తనాలు రానున్నట్లు తెలిపారు.

## పాఠశాలకు తాగు నీటి సౌకర్యం

చేగుంట, మే17: పాఠశాలలో తాగు నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు కర్నాల్‌పల్లి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ సత్యనారాయణ తెలిపారు. కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో నీటి సౌకర్యం కోసం సంపు ఏర్పాటు, గదుల మరమ్మత్తులు, తలుపులు, కిటికిలు, టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులను ఏఈ మమత, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. వారితో చైర్మన్ మాధవి, సీఏ సరిత, కమిటి సభ్యులు ఉన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం




నర్సాపూర్, మే 17: పట్టణానికి చెందిన నాగరాజుగౌడ్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి శుక్రవారం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దప్పికను తీర్చుతున్నట్లు తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

చిలిపిచెడ్,మే 17: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై షేక్ మహబూబ్ హెచ్చరించారు. మండలంలోని చండూర్ చౌరస్తాలో మెదక్–సంగారెడ్డి రహదారిపై శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారుల వద్ద ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ పరిశీలించారు. తమ వెంట వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. చలాన్లను ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. తనిఖీలో దేవీసింగ్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915.
NT-5279

WANTED
★Well Qualified Experienced High School Teachers for Gandhi Centenary High School, Sangareddy for Maths, English and Librarian immediatly Contact: 9491266562, 6305818044.
NT-328226

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.